ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





స్వచ్ఛ బడులకు.. అడుగులు



- అమ్మ ఆదర్శ కమిటీలకు బాధ్యతలు
- నిధుల మంజూరుకు సర్కారు ఉత్తర్వులు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపులు
- స్కావెంజర్ల నియామకంపై ఆశలు
- జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో మెరుగునకు చర్యలు

జఫర్‌గడ్, ఆగస్టు 18: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనతో పాటు పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేలా చర్యలకు ఉపక్రమించడంతో పాటు నిధుల మంజూరుకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి కనీస మరమ్మతుల కోసం ముందస్తు నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. మహిళా సంఘాలతోనే సర్కారు బడులను అభివృద్ధి చేయించాలనే సంకల్పంతో ముందుకెళుతున్న ప్రభుత్వం తాజాగా బడుల్లో పరిశుభ్రత నిర్వహణ కూడా వారి పర్యవేక్షణలోనే చేపట్టాలని సంకల్పించింది. ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పాఠశాలల పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులను కేటాయించనుండగా.. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విడుదలయ్యే కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా వాటిని అందించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయా పాఠశాలలు, వసతి సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, తదితర వివరాలతో కూడిన నివేదికను జిల్లా విద్యాశాఖ కొద్ది రోజుల క్రితం రాష్ట్ర శాఖకు నివేదించింది.

ఆదర్శ కమిటీలకే బాధ్యతలు..

జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 341, ప్రాథమికోన్నత 64, ఉన్నత పాఠశాలలు 103 ఉన్నాయి. మొత్తం 32,965 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్య బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలకే అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. నిర్వహణ నిధులను కమిటీ సభ్యుల ఖాతాల్లో జమ చేయనుంది. సర్వీసు వర్కర్లను నియమించుకుని ప్రతి రోజు పాఠశాల, పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రపరచడంతో పాటు మొక్కలకు నీళ్లు పోయడం, సంరక్షణ, తదితర పనులను నిర్వహించాల్సి ఉంటుంది. పనులు చేసే ఈ సర్వీసు వర్కర్లకు నెలకు రూ.3 వేలకు తగ్గకుండా ఇవ్వాల్సి ఉంటుంది. శుభ్రత కోసం అవసరమైన వస్తువులకు సమగ్ర శిక్షా నిధుల (పాఠశాలల నిర్వహణ గ్రాంట్ల) నుంచి వెచ్చించాల్సి ఉంటుంది.

తొలగిపోనున్న ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు గతంలో స్కావెంజర్లు ఉండేవారు. కరోనా సమయంలో గత ప్రభుత్వం వారిని తొలగించి పంచాయతీ, మునిసిపల్ కార్మికులకు పారిశుధ్య, పరిశుభ్రత బాధ్యతలను అప్పగించింది. కానీ, ఆయా కార్మికులు బడుల్లో పారిశుధ్య పనులు చేయకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రత అంతంత మాత్రంగానే ఉండేది. 2021 విద్యా సంవత్సరం నుంచి మూడేళ్లుగా కనీసం విద్యాలయాల గదులు, ప్రాంగణాలు శుభ్రం చేసేవారు కరువయ్యారు. పాఠశాల ప్రాంగణాల్లోకి అడుగుపెడితే చుట్టూ చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చేసేదేమీ లేక కొన్ని చోట్ల ఉపాధ్యాయులు సొంత డబ్బులు చెల్లించి కార్మికులను పెట్టుకుని పనులు చేయిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాఠశాలలను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా 'మనఊరు-మనబడి' కింది కోట్లాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ స్థాయిలో మరమ్మతులు, వసతి సౌకర్యాలను కల్పించి పాఠశాలలను తీర్చిదిద్దారు. వీటిలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతను చేపట్టాల్సిన అవసరం ఉంది. పాఠశాలల్లో నెలకొన్న ఈ సమస్యలన్నింటినీ గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని నిర్ణయించింది. దీంతో బడుల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణకు కార్మికులు అందుబాటులోకి రానుండడంతో ఇబ్బందులు తొలగిపోనున్నాయని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు భావిస్తున్నారు.

నిధుల కేటాయింపు ఇలా..

విద్యార్థుల సంఖ్య	నిధులు
01-30	రూ.3వేలు
31-100	రూ.6వేలు
101-250	రూ.8వేలు
251-500	రూ.12వేలు
501-750	రూ.15వేలు
750కి పైగా..	రూ.20వేలు

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ నుంచి ఈ నిధులను ప్రభుత్వం మంజూరు చేయనుంది. అయితే మూడు నెలలకోసారి ముందస్తు నిధులు మంజూరు చేస్తారా? లేదంటే పది నెలలకు కలిపి మొత్తం నిధులను ఒకేసారి మంజూరు చేస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

మంగు జయప్రకాశ్, గెజిటెడ్ హెచ్ఎం, హిమ్మత్‌నగర్ హైస్కూల్



ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు నిధులు మంజూరు నిర్ణయం హర్షణీయం. కొన్నేళ్లుగా వీటి నిర్వహణకు ఎలాంటి నిధులు లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. అనేక పాఠశాలల్లో పనుల నిర్వహణకు ఉపాధ్యాయులే సొంతగా డబ్బులు ఖర్చు చేశారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలు పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి స్వచ్ఛతగా ఉండేలా అమ్మ ఆదర్శ కమిటీలకు బాధ్యతలు అప్పగించి నిధులు మంజూరుకు చర్యలు చేపట్టడం సంతోషకరం.

పరిశుభ్రత, పారిశుధ్య మెరుగుకు దోహదం

కె.రాము, జిల్లా విద్యాశాఖాధికారి



ప్రభుత్వ నిర్ణయం పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్య మెరుగుకు ఎంతో దోహదపడనుంది. బడుల్లో స్వచ్ఛతకు నిధులను కేటాయించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఆయా పాఠశాలలు, విద్యార్థుల వివరాలను సేకరించి రాష్ట్ర విద్యాశాఖకు నివేదికను అందజేశాం. ప్రభుత్వ జీవో ప్రకారం ఆయా పాఠశాలల అమ్మ ఆదర్శ కమిటీలకు ఈ స్వచ్ఛత, పారిశుధ్య పనులను అప్పగించారు. జిల్లాలో మొత్తం 508 ప్రభుత్వ పాఠశాలలు, 32,965 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులు మంజూరవుతాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశుభ్రత నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతాం.

సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

- జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జనగామ కల్చరల్, ఆగస్టు 18: బహుజన వీరుడు, పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జనగామలోని కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలో అతిసామాన్య గౌడ కుటుంబంలో పాపన్న జన్మించారన్నారు. శిస్తు వసూళ్లలో ప్రజలను పెడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి అన్నివర్గాల పేదల పక్షాన నిలిచి నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన సర్దార్ సర్వాయి పాపన్న మహాయోధుడని కీర్తించారు. పాపన్న ఆశయాలను భావితరాలకు తెలిపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా విద్యార్థులకు బోధించాలన్నారు. అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ 17వ శతాబ్ద కాలానికి చెందిన పాపన్న స్వేచ్ఛ, సమానత్వం వంటి ఉన్నత ఆశయాలతో ఈ గడ్డపై జన్మించడం మనందరి గర్వకారణమన్నారు. పాపన్నగౌడ్ జీవన ప్రయాణం పూర్తిగా వైవిధ్య భరితమన్నారు. అంతకుముందు పాపన్నను స్మరిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు పాడిన పాటలు అలరింపజేశాయి. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి రవీందర్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన పోరాడుతాం..

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఆగస్టు 18: రైతుల రుణమాఫీపై మాటతప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేవరుప్పులలోని మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడుతూ రుణమాఫీ ఎగ్గొట్టి రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. మొదటగా రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమని చెప్పి బడ్జెట్‌లో రూ.26వేల కోట్లను కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయానికి చేరుకున్న రైతులు రుణమాఫీ కాలేదని తెలపడంతో వారికి భరోసా కల్పించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, జిల్లా యువజన నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, బస్వ మల్లేశం, కొల్లూరి సోమయ్య, గాంధీనాయక్, జోగు సోమనర్సయ్య, చింత సోమయ్య, కాడబోయిన యాదగిరి, చింత రవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పరివర్తనలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం

విద్యా సదస్సులో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

జనగామ కల్చరల్, ఆగస్టు 18: సామాజిక పరివర్తనలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య అధ్యక్షత వహించగా ఓయూ ప్రొఫెసర్ సి.కాశీం, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి వక్తలుగా పాల్గొని మాట్లాడారు. భావి సమాజాన్ని అంతరాలు లేని సమాజంగా, జ్ఞాన సమాజంగా, విలువలు కలిగిన ఆదర్శ సమాజంగా తీర్చిదిద్దడంలో విద్యా విధానం ప్రధాన పాత్ర పోషిస్తుందని, అందులో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమైనదని అన్నారు. ఉపాధ్యాయుడు నిత్యం అధ్యయనం చేస్తూ నిత్యనూతనంగా బోధన చేయాలని, విద్యార్థులలో లౌకిక, శాస్త్రీయ భావాలు పెంపొందేలా సమాజాన్ని ఎదిగించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో పాలక వర్గాలు శాస్త్రీయ విలువలు పెంచే పాఠ్యాంశాలు తొలగిస్తూ అంధ విశ్వాసాలు పెంపొందించే విద్యా విధానాన్ని ముందుకు తెస్తున్నాయన్నారు. ఇది సరైనది కాదన్నారు. విద్య సామాజిక అవసరాలు తీర్చేదిగా ఉండాలి కానీ పాలకవర్గాల అభిప్రాయాలు వ్యక్తపరిచేదిగా ఉండకూడదన్నారు. భారత ఆర్థిక విధానాలు దేశ పౌరుల ఆర్థిక అంతరాలు తగ్గించేవిగా కాకుండా ఆర్థిక అంతరాలు పెంచేవిగా ఉంటున్నాయని తెలిపారు. దీంతో పేదలు నిరుపేదలుగా మారుతున్నారని, సంపన్నులు అపర కుబేరులుగా పరిణమిస్తున్నారన్నారు. ఆర్థిక విధానాలు మారకపోతే దేశంలో ఆర్థిక సంక్షోభం తప్పదన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.నాగిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్, నల్లనాగుల రాజు, కె.యాదగిరి, కె.సునంద, వి.కొమురెల్లి, అంకుశావలి, వజ్రయ్య, శ్రీహరి, వెంకన్న, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పునరావృతమైతే చర్యలు

- ఎన్‌సీసీ సిబ్బందికి మిషన్ భగీరథ డీఈ సూర్య హెచ్చరిక
- ఎర్రకుంట తండా, కొండాపూర్ గ్రామం సందర్శన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎర్రకుంట తండాలో మిషన్ భగీరథ నీరు అందిస్తున్న అధికారులు

చిలుపూర్, ఆగస్టు 18: తాగునీటి సమస్య పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని మిషన్ భగీరథ డీఈ సూర్య ఎన్‌సీసీ సిబ్బందిని హెచ్చరించారు. 'తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన - కొండాపూర్ శివారు ఎర్రకుంట తండాలో మహిళల తండ్లాట' అనే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో మండలంలోని ఎర్రకుంట తండా, కొండాపూర్ గ్రామాలను మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సందర్శించారు. పైపులైన్లకు తక్షణ మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా డీఈ సూర్య మాట్లాడుతూ తరిగొప్పుల సమీపంలోని ఏన్యానాయక్ తండా వద్ద ఉన్న ఓహెచ్‌బీఆర్(ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)లో నెలకొన్న సాంకేతిక లోపంతో పాటు కొన్నిచోట్ల పైపులైన్లు దెబ్బతిన్న కారణంగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఈ సమస్యను ఈఈ రాజయ్య దృష్టికి తీసుకెళ్లామని, పైపులైన్లకు తక్షణ మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొండాపూర్‌లో ఉన్న ఓహెచ్ఎస్‌ఆర్ ట్యాంకుకు 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల విద్యుత్ మోటార్‌ను సైతం పైపలైన్‌కు అనుసంధానించడం జరిగిందన్నారు. తాగునీటి సరఫరాపై నిత్యం పర్యవేక్షించాలని ఎన్‌సీసీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ వేణుగోపాల్, మాజీ ఉపసర్పంచ్ కౌడ సంపత్, మారబోయిన ఎల్లయ్య, పంచాయతీ సెక్రటరీ ఎన్నకూస రాజు, ఎన్‌సీసీ సిబ్బంది రవితేజ, నరేష్, వీరాస్వామి, లోడెం రవీందర్, గాలి ప్రవీణ్, మారబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో 'శ్రీముసలమ్మ' ఈవో

- దుకాణదారుడి నుంచి రూ.20వేలు లంచం డిమాండ్
- తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- మరిపెడలోని ఇంట్లోనూ తనిఖీలు





గుంజేడులో ఈవో భిక్షమాచారిని విచారిస్తున్న ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు, పట్టించిన నల్లెపు సాంబయ్య

కొత్తగూడ, ఆగస్టు 18: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలోని శ్రీముసలమ్మ ఆలయ ఈవో భోగోజు భిక్షమాచారి ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ దుకాణ టెండరుదారుడి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

గుంజేడు శ్రీముసలమ్మ ఆలయం ఆవరణలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కిరాణ షాపు ఏర్పాటు చేశారు. గత మే 29న టెండరులో గుంజేడుకు చెందిన పాల్తి రాములు అనే వ్యక్తి ఈ దుకాణాన్ని దక్కించుకున్నాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన నల్లెపు సాంబయ్య ఈ షాపును నడిపిస్తున్నాడు. ఈ దుకాణంలో మద్యం అమ్ముతున్నారని గత జూన్ 11న షాపును దేవాదాయ శాఖ సీజ్ చేసింది. ఈ క్రమంలో దుకాణాన్ని మళ్లీ తెరుచుకోవడానికి సాంబయ్య దేవాదాయ శాఖ ఉన్నతాధికారి నుంచి అనుమతి తీసుకువచ్చాడు. అయితే షాపు పునరుద్ధరణకు లంచం ఇవ్వాలని ఈవో భిక్షమాచారి నెల రోజులుగా డిమాండ్ చేస్తు న్నాడు. లేకుంటే మళ్లీ షాపును సీజ్ చేయిస్తానని ఇబ్బందులకు గురిచేశాడు. ఈ విషయంపై సాంబయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో ఆదివారం మధ్యాహ్నం గుంజేడుకు వచ్చిన అధికారులు.. సాంబయ్యకు రూ.20 వేలు ఇచ్చి ఈవో భిక్షమాచారి ఇప్పించారు. ఈవో రూ.20వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని కెమికల్ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం భిక్షమాచారిని కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, రాజు పాల్గొన్నారు.

మరిపెడోలోని ఈవో ఇంట్లో తనిఖీలు

మరిపెడ: మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో ఆదివారం రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవోగా పనిచేస్తున్న భిక్షమాచారి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఈవో ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు తెలిపిన వివరాల ప్రకారం... మరిపెడలోని ఈవో ఇంట్లో రూ.70వేల నగదు, 270 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారు ఆభరణాలు లభించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఏసీబీ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

అనురాగాల రాఖీ

శ్రావణమాసం వ్రతాలు, పూజలు, పెళ్లిళ్లకే కాదు... అన్నాచెల్లెళ్లకు, అక్కాతమ్ముళ్లకు కూడా చాలా ప్రత్యేకమైన మాసం. శ్రావణ పూర్ణిమ రోజే రాఖీ పూర్ణిమ జరుపుకుంటారు. ఈ రోజు అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రక్షగా, వారు ఎప్పుడూ సంతోషంగా, క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాఖీని కడతారు.

- సోదర ప్రేమకు ప్రతీక
- నేడు రక్షా బంధన్
- పుట్టింటికి చేరిన ఆడపడుచులు
- రాఖీ దుకాణాలు, స్వీట్ షాపుల్లో రద్దీ
- రాకపోకలతో బిజీగా మారిన జిల్లా కేంద్రం



జనగామ కల్చరల్, ఆగస్టు 18: తమ జీవితాలకు భద్రత, భరోసా సోదరుడే అంటూ మనసా, వాచా, కర్మణా నమ్మి అతను పదికాలాల పాటు క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కడతారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, అనురాగానికి అద్దంపట్టే అపురూపమైన పర్వదినమే రక్షాబంధన్. తమకు ప్రాణసమానమైన సోదరులు కలకాలం సుఖంగా ఉండాలని, తమకు రక్షణగా నిలవాలని కోరుకుంటూ వేడుకలు జరుపుకుంటారు. రాఖీ కట్టాక స్వీటుతో నోటిని తీపి చేసుకోవడం ఆనవాయితీ. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని జనగామ జిల్లాలో సోమవారం కన్నుల పండువగా జరుపుకోనున్నారు.

వాట్సాప్ మయమైనప్పటికీ..

పుట్టినరోజు మొదలు పర్వదినాలు, పెళ్లి రోజుల వరకు వాట్సాప్‌లో శుభాకాంక్షలు తెలియజేస్తూ మిత్రులు మెసేజ్‌లు పంపించడం నేటి ఆన్‌లైన్ అనుబంధంగా మారింది. ప్రస్తుతం వాట్సాప్ ట్రెండ్ నడుస్తున్నప్పటికీ రాఖీ మాత్రం ఆఫ్‌లైన్‌లో కొనసాగాల్సిందేనని సోదర, సోదరీమణులు భావిస్తున్నారు. చెల్లెలు తన ఇంటికి వచ్చి రాఖీ కట్టి మంగళ హారతి ఇచ్చి స్వీటు తినిపించి కట్నకానుకలు స్వీకరిస్తేనే ఆత్మీయతానురాగాల రాఖీ వెల్లివిరుస్తుందని సోదరులు భావిస్తారు.

సంతోషిమాత అమ్మవారి జన్మదినం

రాఖీ పౌర్ణమి అమ్మవారి అవతారమైన సంతోషిమాత జన్మదినం. ఈ రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రంలోని సంతోషిమాత, ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం 5.15 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం, రక్షాబంధనం, తీర్థప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకోవాలని ఆలయ ప్రధానార్చకులు పార్నంది శ్రీనివాసశర్మ తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని మూలబావి అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారలకు పంచామృత విశేష అభిషేకం, అలంకరణ, భోగము నిర్వహించబడుతుందని ఆలయ ప్రధానార్చకులు మోహ నకృష్ణ భార్గవ తెలిపారు. ఈ రోజున జీర్ణమైనా లేదా కాకపోయినప్పటికీ కొత్త జంజిరాలు(గాయత్రిలు) ధరిస్తారు. అందుకే ఈ పౌర్ణమిని జంజిరాల పౌర్ణమి అని కూడా అంటారు.



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



స్వీట్ షాపులో నెలకొన్న రద్దీ

జిల్లాలో వెలిసిన రాఖీల దుకాణాలు

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో రాఖీల దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రైల్వేస్టేషన్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు, నెహ్రూ పార్కు నుంచి బస్టాండు వరకు, బస్టాండు నుంచి పోచమ్మ దేవాలయం వరకు, తహసీల్దార్ కార్యాలయం నుంచి కోర్టు ఏరియా వరకు, చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ప్రత్యేక రాఖీల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వారం రోజుల ముందే దుకాణాలు ఏర్పాటు కావడంతో మహిళలు రాఖీల కొనుగోళ్లతో బిజీగా ఉన్నారు. వెలకట్ట లేని అన్నాచెల్లెళ్ల బంధానికి వెరైటీ రాఖీలను విక్రయించారు. ఈ సంవత్సరం రాఖీలు రూ.10 నుంచి 100 వరకు ధర పలికాయి.

కిటకిటలాడిన స్వీట్ షాపులు

రాఖీ ఓ తీపి జ్ఞాపకం. అందుకే అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీ కట్టడంతో పాటు స్వీట్ తినిపించడం ఆనవాయితీ. దీంతో జిల్లాలో అటు రాఖీ స్టాళ్లతోపాటు ఇటు స్వీట్ షాపులు కిటకిటలాడుతున్నాయి. కొన్నిచోట్ల రాఖీలతో పాటు మిఠాయిలు కూడా విక్రయిస్తున్నారు. దీంతో మహిళలు రాఖీలతో పాటు మిఠాయిలు కూడా కొనుగోలు చేస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రంలో రాజస్తానీ స్వీట్ హౌస్‌లు మిఠాయీ కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. ఈ పర్వదినం సందర్భంగా మిఠాయిలు కిలో రూ.250 నుంచి రూ.800 వరకు విక్రయాలు జరిపారు. ఆడపడుచుల రాకపోకలతో బస్టాండుతో పాటు జిల్లా కేంద్రం రద్దీగా మారింది. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలతో జిల్లా కేంద్రంలోని రహదారులు కిక్కిరిసిపోయాయి.



జనంతో రద్దీగా ఉన్న జనగామ బస్టాండు

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

వేలేరు మండలం శాలపల్లి యువకుడి ఆత్మహత్య

వేలేరు, ఆగస్టు 18: వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని పంటలను సాగు చేయగా ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో పాటు పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురైన యువ రైతు పురుగుల మందుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆదివారం తెల్లవారు జామున ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఏ సురేష్ తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా వేలేరు మండలం శాలపల్లి గ్రామానికి చెందిన దామెర సమ్మయ్య- కోమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తండ్రి దామెర సమ్మయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం పెద్ద కుమారుడైన దామెర అనిల్ కుమార్ (31) పై పడింది. తమ్ముడు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అలాగే చెల్లెలు వివాహాన్ని ఇటీవలచేశాడు. ఎలాంటి జీవనోపాధి లేకపోవడం, ఎలాంటి ఆస్థులు సైతం లేవు. కేవలం ఇళ్లు మాత్రమే ఉంది. ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. గత మూడు సంవత్సరాలుగా అందులో పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఇందులో ఆశించిన మేరకు పంట రాకపోవడంతో సుమారుగా రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీనికి తోడు కుటుంబ భారంతో మరో రూ.3.50 లక్షలు, మొత్తం రూ. 6.50 లక్షల వరకు అప్పులైయ్యాయి. దీంతో చేసిన అప్పుల ఎలా తీర్చాలని మరోవేదనకు గురైయ్యాడు. ఈక్రమంలో శనివారం అర్థరాత్రి ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గమనించిన బంధువులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు, మృతునికి వివాహం కాలేదు. దీంతో మృతుడి తల్లి దామెర కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దామెర అనిల్‌కుమార్ (ఫైల్)

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రంజిత్



వరంగల్ లీగల్, ఆగస్టు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా హనుమకొండ పట్టణానికి చెందిన న్యాయవాది కూనూరు రంజిత్ నియమితులయ్యారు. టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సస్పెన్షన్

మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రవీంద్రశర్మకు బాధ్యతలు

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం హైకోర్టు ఉత్వర్వులు జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూ రు కోర్టు జడ్జి మట్ట సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఆయన స్థానంలో జనగామ జిల్లా కోర్టు జడ్జి బి.రవీంద్రశర్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది.

బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.

హరికథా గాన సరస్వతి

లక్ష్మీనారాయణ భాగవతార్

- నాలుగు దశాబ్దాలుగా కళారంగంలో తనదైన ముద్ర
- ఒడిదొడుకులను ఎదురైనా కళామతల్లి సేవలోనే..



మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య చేతుల మీదుగా సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ



జనగామ కల్చరల్, ఆగస్టు 18: హరికథ తెలుగువారి విశిష్ట ప్రక్రియ. రాగ - తాళ - హావ - భావ ప్రకటనలతో శ్రోతలను, ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో దానికదే సాటి. జానపదులకు, పండితులకు అందరికీ ఇష్టమైన కళాప్రక్రియ. వేదికపై ఓ వ్యక్తి నిలబడి తాను గానం చేస్తున్న హరికథలో వచ్చే పాత్రలన్నిటిని తానే ధరించి నటించి చూపాలి. అందుకే సర్వకళల సమాహారమే ఈ హరికథ గాన ప్రక్రియ. ఈ హరికథను తెలుగువారి సంస్కృతి చమత్కారంగా భావిస్తారు. కళలకు ఆదరణ తగ్గిపోతున్న సమయంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యం కలిగి భగవన్నామస్మరణ చేస్తూ, పట్టు వస్త్రాలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టి, నొదుట నామాన్ని దిద్దుకొని, చేతిలో చిరుతలు పట్టుకొని, హరినామ స్మరణ చేస్తూ, హరికథ ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు జనగామ జిల్లాకు చెందిన హరికథకుడు బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్. బొడిగె అంజమ్మ, శివయ్య దంపతులకు 1954 సెప్టెంబరు 25న జన్మించిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్ పట్టా పుచ్చుకొని హరికథా గానంతో జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రముఖ తెలుగు పండితులు పండితారాధ్యుల రామగిరి నాగయ్య శాస్త్రి, ప్రముఖ సంస్కృత పండితులు, దేవీ ఉపాసకులు మాదవపెద్ది చిన వెంకన్న శాస్త్రి, ప్రముఖ రచయిత నెల్లుట్ల నర్సింహారావు లక్ష్మీనారాయణకు సాహిత్య గురువులు. 40ఏళ్లుగా రాజరాజేశ్వరీదేవి అమ్మవారినే ధ్యానిస్తూ హరికథ కళారంగంలో ఒడిదుడుకులు ఎదురైనా ఆ కళామతల్లికి సేవలోనే ఉన్నారు.

ప్రదర్శనలు.. సత్కారాలు.. అవార్డులు..

లక్ష్మీనారాయణ తన 14వ యేట 7వ తరగతి చదువుతున్న రోజుల్లో తల్లిదండ్రులతో కలిసి భద్రాచల దేవస్థానానికి వెళ్లి ఆ పవిత్రమైన గోదావరి నదీ తీరాన 'శ్రీ సీతారామ కళ్యాణం', 'భద్రాద్రి వైభవం' అనే సంగీత రూపకాన్ని రచించి స్థానిక చెన్న కేశవ స్వామి భజన మండలిలో చేరి అనేక వేదికల ద్వారా గానం చేశారు. 1972లో హైద్రాబాద్ ఆకాశవాణి, యువవాణిలో ఈ రూపకాన్ని గానం చేశారు. 1973లో స్థానిక నాటక కళాసంస్థ శ్రీ నటరాజ కళానికేతన్‌లో గాయకుడిగా చేరి తన గాన కళను అభివృద్ధి చేసుకున్నారు. 1975లో స్వతహాగా శ్రీ నటరాజ సంగీత విభావరి అనే పేరుతో ఒక సంస్థను స్థాపించి ప్రదర్శనలు ఇస్తూ ఔత్సాహిక గాయనీ గాయకులతో కలిసి భక్తి ప్రధానమైన సంకీర్తనలో కూడిన పాటక కచేరీలు చేశారు. ఆలిండియా రేడియో కేంద్రం ద్వారా అనేక ప్రత్యేక సంగీత రూపకాలైన నల్లనివాడు, దివ్య దీపావళి, హోలీ సంబరాలు, ఉగాది వేడుక, సంక్రాంతి సరదాలు, బతుకమ్మ సౌందర్యం మొదలగు రూపకాలు రచించి స్వయంగా సంగీతాన్ని సమకూర్చి ఆలిండియా రేడియో ద్వారా సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ద్వారా మైసూరు, మద్రాసు, మహారాష్ట్ర, బిహార్, ఛత్తీస్‌గఢ్, రాయపూర్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో హరికథా గానం చేసి అనేక సత్కారాలు, బిరుదులు అందుకున్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

ఓ వైపు ప్రదర్శనలిస్తూనే మరోవైపు హైద్రాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో హరికథ డిప్లొమా కోర్సు పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1995లో మద్రాసు భాగవతా సేవా మండలి వారితో సత్కారం అందుకున్న ఆయన.. ప్రముఖ సినీ నటుడు పొట్టి ప్రసాద్ చేతుల మీదుగా గానకోకిల బిరుదును అందుకున్నారు. కందుకూరి వీరేశలింగం జన్మదినం సందర్భంగా 2011లో నాటి ఏపీ ప్రభుత్వం తరపున కలెక్టర్ రాహుల్ బొజ్జా చేతుల మీదుగా రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు. 2013లో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని, 2015లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డితో సన్మానం అందుకున్నారు. 2024లో విజయనగరం ఆదిబట్ల నారాయణదాసు సంస్థ ఆధ్వర్యంలో హరికథా భాస్కర అనే బిరుదును, తాడేపల్లిగూడెంలో ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముఖ ఆంజనేయ రాజు సంస్థ ఆధ్వర్యంలో 'హరికథా గాన సరస్వతి', సిద్దిపేటలోని ఎస్ఎస్‌సీ ఛానల్ ఆధ్వర్యంలో 'హరికథా కేసరి' బిరుదులను అందుకున్నారు. యువ సంగీత దర్శకులు, కవి చిలుమోజు సాయికిరణ్ రచించిన కవనతీగ కవితా సంపుటి పుస్తకావిష్కరణ సందర్భంగా 'జీవిత సాఫల్య పురస్కారం', 'హరికథా కళాబంధు' బిరుదును పొందారు. తెలంగాణ సమైక్యతా వజ్రోత్సవాలను పురస్కరించుకొని నాటి ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య, జడ్పీ చైర్మెన్ పాగాల సంపత్‌రెడ్డి చేతుల మీదుగా ఘన సన్మానం పొందారు.

భరత నాట్యమయూరి..

అలకనంద



మల్హర్, ఆగస్టు 18 : ఆ చిన్నారి వయసు 12యేళ్లు. ఆరో తరగతి చదువుతోంది. తనకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువతో ఓ గురువు వద్ద నాట్యం నేర్చుకుంటూనే.. సోషల్‌మీడియాలో అందుబాటులో ఉన్న నృత్య సాధన వీడియోలు చూసి మరింత సాధన చేసింది. చిన్నవయసులోనే పలు వేదికలపై ప్రదర్శనలిచ్చి ఔరా అనిపించుకుంటోంది భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ అలకనంద రాథోడ్. శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ అనేక ప్రశంస పత్రాలు, అవార్డులతో పాటు ప్రముఖులు, సాహితీ ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలకనంద తండ్రి బానోత్ రాజ్‌కుమార్ మాజీ సైనికుడు, తల్లి దివ్య గృహిణి. ప్రస్తుతం వారు భూపాలపల్లిలో నివాసం ఉంటుండగా.. అలకనంద పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సాహిత్య రంగంలో పట్టున్న తండ్రి రాజ్‌కుమార్.. తన కూతురు అలకనందకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువను గుర్తించి.. రెండేళ్ల క్రితం పట్టణంలో నాని మాస్టర్ వద్ద చేర్పగా.. ఆయన శిక్షణ, సలహాలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అలకనంద సోషల్ మీడియాలో వివిధ నాట్యాల వీడియోలు చూస్తూ సాధన ప్రారంభించి నాట్యంపై పట్టు పెంచుకుంటోంది. ఈ క్రమంలోనే పలు వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇస్తూ సత్తా చాటుతోంది. భూపాలపల్లిలో సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో, శ్రీరామ నవమి ఉత్సవాలు, గణపతి నవరాత్రి ఉత్సవాలు, హైదరాబాద్ రవీంద్రభారతి, త్యాగరాయ గానసభల్లో నిర్వహించిన పలు జాతీయ స్థాయి నృత్య పోటీలు, ప్రదర్శనలు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బడాఖానా వేడుకలు, తదితర వేదికలపై నృత్య ప్రదర్శనలు చేసింది. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రశంసా ప్రత్రం, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ జన్మదిన వేడుకల్లో ప్రశంస పత్రం, ఉగాది పురస్కార వేడుకల్లో నాట్య కళా ప్రవీణ అవార్డు, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి ఆధ్వరంలో ఇటీవల గౌతమి నంది అవార్డు అందుకుంది. అలాగే జాతీయస్థాయి ఐకాన్ అవార్డు కూడా సొంతం చేసుకుంది. నాట్యంతో పాటు చదువులోనూ రాణిస్తున్న అలకనంద ఐఏఎస్ కావడమే లక్ష్యంగా తన భవిష్యత్‌కు బాటలు వేసుకుంటోంది.



ప్రశంసా పత్రాలు, అవార్డులతో అలకనంద



జాతీయస్థాయి గౌతమి నంది అవార్డును అందుకుంటున్న అలకనంద

సౌకర్యాల లేమిలో గ్రంథాలయాలు

- నిధుల కొరతతో వసతులు కరువు
- తీవ్ర సిబ్బంది కొరత
- ఉన్నవారిపైనే పని భారం
- పదేళ్లుగా జరగని నియామకాలు
- పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నిర్వహణ

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలు నిధులలేమివల్ల అనేక సమస్యలతో కూనారిల్లుతున్నాయి. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు కనీసం సౌకర్యాలు కల్పించలేకపోతున్నాయి. ఆరేళ్లుగా గ్రంథాలయాలకు బడ్జెట్ రావడం లేదు. దీంతో కరెంట్ బిల్లులు కట్టలేని దయనీయ స్థితి నెలకొన్నది. బిల్లులు చెల్లించకపోతే కరెంట్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ సంస్థ ఇప్పటికే వీటికి రెండు మూడు సార్లు నోటీసులు జారీ చేసింది. గ్రంథాలయాలకు పేపర్ బిల్లులు చెల్లించడానికి కూడా డబ్బులు లేవు. ఆరు నెలలుగా పేపర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పేపర్‌బాయ్‌లు బిల్లుల కోసం కాళ్లరిగేలా తిరుగు తున్నారు. బిల్లులు ఎంతకూ చెల్లించకపోవడంతో కొన్ని చోట్ల గ్రంథాలయాలకు పేపర్లు వేయడాన్ని మానుకున్నారు. కాలిపోయిన బల్బులను మార్చాలన్న, విరిగిపోయిన కుర్చీలకు మరమ్మతులు చేయించాలన్నా కూడా డబ్బులు లేక ఉద్యోగులు సతమతమవుతున్నారు.



హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని జిల్లా క్రేంద గ్రంథాలయం

వెల్లువలా ఉద్యోగార్థులు

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ అవుతున్నాయి. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో గ్రంథాలయాలకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలు అభ్యర్థులతో కిటకిటలాడు తున్నాయి. కూర్చోవడానికి కుర్చీలు కూడా సరిపోవడం లేదు. సరిపోయేన్ని కుర్చీలు సమకూర్చడానికి గ్రంథాలయాల వద్ద డబ్బుల్లేవు. దీనితో పాఠకులు ఏదోవిధంగా సర్దుకొని కూర్చొని చదువుకుంటున్నారు. పాఠకులకు కావలసిన స్టడీ మెటీరియల్ కోసం మార్కెట్‌లోకి వచ్చిన కొత్త పుస్తకాలను గ్రంథాలయాలు సమకూర్చలేకపోతున్నాయి. పాత పుస్తకాలతోనే పాఠకులు ఎలాగోలా సర్దుకుపోతున్నారు. కొత్త పుస్తకాల కోసం ఇండెంట్ పెడితే ఎప్పుడో గానీ రావడం లేదు. పాఠకులు డిమాండ్ బుక్‌లో రాసిన ఏ నెల రోజులకో గానీ అందడంలేదు. ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులు కరెంట్ అఫైర్స్ కోసం ఎక్కువగా వివిధ పత్రికలపై ఆధారపడుతుంటారు. ఎన్ని ఎక్కువ పత్రికలు చదివితే అంత తాజా మెటీరియల్ దొరుకుతుంది. కానీ డబ్బులు లేక ఏవో గ్రంథాలయాలు ఏవో కొన్ని పత్రికలను మాత్రమే పాఠకులకు సమకూర్చగలుగుతున్నాయి.

తీవ్ర సిబ్బంది కొరత

గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టేంత మంది మాత్రమే ఉన్నారు. లైబ్రరీలన్నీ ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నడుస్తున్నాయి. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో సహా ఆరు జిల్లా గ్రంథాలయాలు, 50 మండల కేంద్రాల్లో 50 బ్రాంచ్ లైబ్రరీలు ఉన్నాయి. మండలాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఇప్పటి వరకు లైబ్రరీల ఏర్పాటు జరగలేదు. ఈ మండలాలకు చెందిన పాఠకులు పొరుగు మండలాలలోని లైబ్రరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉద్యోగ నోటిఫికేషన్ల వల్ల ఈ గ్రంథాలయాలు కూడా నిరుద్యోగ పాఠకులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. ఈగ్రంథాలయాల్లో 150 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 21 మంది మాత్రమే ఉన్నారు. ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు మరో 50 మంది ఉన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారి నియామకాలు జరగటం లేదు. 1993 నుంచి కొత్త రిక్రూట్‌మెంటే లేదు. ప్రతీ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 25 నుంచి 30 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 50మందికిపైగా ఔట్‌సోర్సింగ్, లేదా పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉండాలి. అలాగే మండల కేంద్రంలోని బ్రాంచ్ లైబ్రరీలో 5గురు రెగ్యులర్ ఉద్యోగులు, 10 మంది ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా కేంద్ర గ్రంథాలయాల్లో 10 మందికన్నా తక్కువగా రెగ్యులర్ ఉద్యోగులు, 15 మంది వరకు ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పలు గ్రంథాలయాల్లో స్వీపర్లు లేరు. కొన్ని లైబ్రరీలను ఊడ్చేపనిని పార్ట్‌టైమ్ ఉద్యోగులే చేస్తున్నారు.

చైర్మన్లు లేరు..

జిల్లా కేంద్ర గ్రంథాలయాలకు చైర్మన్లు లేరు. గత బీఆర్‌ఎస్ హయాంలో నియమితులైన చైర్మన్లు రాజీనామా పెట్టడంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. హనుమకొండలోని బీఆర్‌ఎస్ సర్కా రు హయాంలో నియమితులైన జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్ లోక్‌సభ ఎన్నికల ముందు తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి ఈ లైబ్రరీకి చైర్మన్ లేదు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన తర్వాత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఉద్యోగార్థులంతా లైబ్రరీలకు వెల్లువలా వస్తున్నారు. పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించలేని గ్రామీణ నిరుపేద నిరుద్యోగులు స్టడీ మెటీరియల్ కోసం లైబ్రరీలనే ఆశ్రయిస్తున్నారు. ఈ దృష్ట్యా వాటిని పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. సిబ్బంది కొరతను తీర్చాలని కోరుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతి సంబురం

ఉమ్మడి జిల్లాలో 476 మంది జెఎల్‌ఎంలకు ఏఎల్‌ఎంలుగా పదోన్నతి

హనమకొండ టౌన్, ఆగస్టు 18: జేఎల్‌ఎంలకు ఏఎల్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని డివిజనల్ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసి సిబ్బందికి ఆర్డర్ కాపీలను అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు చేపట్టాలని, మరోవైపు ఎస్సీ, ఎస్టీ అసోయేషన్లు మాత్రం రిజర్వేషన్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోర్టుకు వెళ్లాయి. కోర్టు తీర్పు పెండింగ్‌లో ఉండటంతో యాజమాన్యం బదిలీలు ముందుగా చేపట్టాలని ఆలోచనకు వచ్చింది. ఈక్రమంలోనే ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై జాక్‌గా ఏర్పడి ముందుగా పదోన్నతులపై దృష్టి సారించాలని సీఎండీ వరుణ్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు.



ఏడీఈ నుంచి ఏఎల్‌ఎంగా ఆర్డర్ కాపీని అందుకుంటున్న దృశ్యం

కాగా, పదోన్నతులపై కోర్టు వెలువరించే తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు తదుపరి చర్యలు తీసుకోబడుతాయని షరతులు విధిస్తూ అర్హత ఉన్న ప్రతీ జెఎల్‌ఎంకు ఏఎల్‌యంగా పదోన్నతి కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న దగ్గరే విధులను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఉద్యోగ సంఘాల చొరవ, కంపెనీ నిర్ణయంతో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి 5 జిల్లాల్లో 2,361 మంది జెఎల్‌ఎంలు ఏఎల్‌యంలుగా పదోన్నతి పొందగా, ఉమ్మడి వరంగల్‌లో 476 మంది ఏఎల్‌ఎంలుగా పదోన్నతి పొందారు. వారిలో హనుమకొండ-119, వరంగల్ -101, జయశంకర్ భూపాలపల్లి, ములుగు- 98, జనగామ- 73, మహబూబాబాద్-85మంది పదోన్నతి పొందారు.

మల్లన్నకు రూ.10 లక్షల రథం బహుకరణ

ఐనవోలు, ఆగస్టు 18 : ఐనవోలు మల్లికార్జునస్వామికి భక్తుడు రథం బహుకరించాడు. సుమారు రూ.10 లక్షల విలువచేసే రథాన్ని టేకు కర్రతో కళాకృతి ఉట్టిపడే విధంగా తయారు చేయించారు. హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన మల్లన్న భక్తులైన తాటికొండ రమాదేవిమల్లేశం దంపతులు తమ కుమారులైన కీ.శే. రాజు, రంజిత్‌ల జ్ఞాపకార్థం రథాన్ని ఆలయానికి తయారు చేయించి ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం రథంను ఆలయానికి అందజేయగా ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు రథంను శుద్ధిచేసి గణపతిపూజ, పుణ్యాహ వచనం పూజలు చేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంలో పెట్టి మాడ వీధులగుండా ప్రదక్షిణలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలైన మల్లేశం దంపతులకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దాత బహుకరించిన రథంను ప్రారంభిస్తున్న ఈవో, అర్చకులు

ఆరోగ్యశ్రీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

లేకుంటే ఈ నెల 20 తర్వాత సమ్మె

వరంగల్ మెడికల్, ఆగస్టు 18: రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలని, ఆరోగ్య మిత్రలకు కూడా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షురాలు శిరీష డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 20 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాలకు ఇప్పటికే పలుమార్లు కలిశామని, అయినప్పటికీ తమ జీతాల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ జీతంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వాపోయారు. 17 ఏళ్ల నుంచి అరకొరజీతాలతో అలమటిస్తున్న తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీవో 60 ప్రకారం రూ.22,750 వేతనం తక్షణమే చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కనీస వేతనాన్ని రూ.35వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

కవులు కలాలను ఎత్తాలి..

అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18: పాలకుల నియంతృత్వ పోకడలను నిరసిస్తూ కవులు తమ కలాలను ఎత్తాలని అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బీఎడ్ కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం నిధి బ్రహ్మచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ.. బ్రిటీష్ వలసవాద దోపిడీని, దౌర్జన్యాల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో ప్రభావితమై జాతీయ వాద భావజాల స్ఫూర్తితో కాలాన్ని, గళాన్ని ఎత్తడం కోసం 1936లో ఆవిర్భవించిన సంఘం అభ్యుదయ రచయితల సంఘం అని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వెంకటి, మహ్మద్ సిరాజొద్దీన్‌లు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లా అరసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, సహ అధ్యక్షులుగా చందనాల సుమిత్ర, ఉపాధ్యక్షులుగా ఆనందాచారి, కాసుల రవికుమార్, సోమ నర్సింహచారి, చాగంటి కిషన్, రసూద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా గజ్జెల స్వరూపరాణి, సహాయ కార్యదర్శులుగా నరేందర్‌రెడ్డి, రాజు, సోమేశ్వరాచారి, రంగాచారి, లెనిన్, క్రాంతి కుమార్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ● పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 4కే రన్



4కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌లు, సీపీ

బాలసముద్రం, ఆగస్టు 18: వరంగల్ నగరాన్ని డ్రగ్స్‌ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా వెల్లడించారు. ఆదివారం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 4కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ కలెక్టర్‌లు పి.ప్రావీణ్య, డాక్టర్ శారద, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో పాటు జబర్దస్త్‌ఫేం అదిరే అభి ముఖ్య అతిథులుగా పాల్గొని 4కే రన్‌ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 4కే రన్‌లో పోలీసులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌నుంచి అదాలత్ సెంటర్ వరకు, తిరిగి అక్కడి నుంచి పోలీస్ పరేడ్‌గ్రౌండ్ వరకు 4కే రన్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా నగదు పురస్కారాలను అందించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌ను వ్యతిరేకించాలని, డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నియంత్రించేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను సేవించేవారిని వాటినుంచి దూరం చేసేందుకు అందరు ప్రయత్నించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తోపాటు ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, సీఐలు సత్యానారాయణరెడ్డి, పి.కిషన్, సతీష్‌కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఏడీలు

ఆర్జేడీ కార్యాలయంలో పర్యవేక్షణ కరువు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీలు) కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 19 జిల్లాలకు పర్యవేక్షక కార్యాలయంగా ఉంటున్న ఆర్జేడీ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన ఏడీలు.. ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో సిబ్బంది జీతభత్యాలకు సంబంధించిన బిల్లులను చేయాల్సిన డీడీవోగా బాధ్యతలు ఉన్న ఏడీ కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక స్థానికంగా ఉండే మరో ఏడీ ఆయన ఎప్పుడు వస్తారో తెలియదని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఉండే సదరు అధికారి అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఇక మరో ఏడీ స్థానికంగానే ఉంటూ కార్యాలయానికి రావడం లేదనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా ఈ మధ్యనే కార్యాలయానికి బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ అదే దారిలో వెళుతున్నట్లు తెలుస్తోంది.



ఏడీ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

పర్యవేక్షణ కరువు

ఏడీల విషయం తెలిసినా ఆర్జేడీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆర్జేడీ వివిధ జిల్లాల్లో పర్యటించిన సందర్భంలోనూ ఏడీల గైర్హాజరుపై దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా విధులకు రాకుండానే వేతనాలు అందుకుంటున్న ఏడీలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.



స్టేషన్ ఘన్‌పూర్‌లో పోచమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 18: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పోచమ్మ దేవాలయాలకు బోనంతో చేరుకున్న మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం, చీర, సారె, కోడి సమర్పించారు. పట్టణంలోని వీధివీధి నుంచి భక్తులు గుంపులు గుంపులుగా పోచమ్మ గుడికి చేరుకుని బోనం సమర్పించి పూజలు చేశారు. గ్రామాలు పాడి పంటలతో విలసిల్లాలని, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో కళకళలాడాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో పట్టణ పెద్దలు, నాయకులు, పూజారులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి : సీపీఐ

జఫర్‌గడ్, ఆగస్టు 18: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల పంట రుణాలను మాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జువారి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకం అమలులో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అర్హత ఉన్నా పంట రుణాలు మాఫీ కాలేదని గ్రామాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతుల పంట రుణాలు మాఫీ కాకపోవడానికి బ్యాంకు అధికారుల లోపమా.. లేక ప్రభుత్వ అధికారుల తప్పిదమా..? అనేది సమగ్ర విచారణ జరపాలన్నారు. రూ.2లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేశాం అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సరైంది కాదని.. అమలు తీరుపై క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి అర్హులైన రైతులకు రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుణమాఫీలో లోపాలపై, బాధిత రైతులను సమీకరించి ఈనెల 21న మండల కేంద్రంలో ధర్నా చేపడుతామని ఆయన పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రమేశ్ కోరారు. సమావేశంలో రైతు ప్రతినిధులు సాకి సాంబయ్య, కడారి సమ్మయ్య, ఎల్లయ్య హరిలాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వేంకన్న ఆలయంలో అధికారుల ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న గణేశ్ కుటుంబ సభ్యులు

చిలుపూర్, ఆగస్టు 18: మండల కేంద్రంలోని బుగులు వేంకన్న ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వ్యక్తిగత సహాయకులు గుండు గణేశ్ సందర్శించారు. ఆదివారం కుటుంబంతో విచ్చేసిన గణేశ్‌కు ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, రంగాచార్యుల వేదమంత్రాల మధ్య స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు స్వామి వారి శేష వస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. గణేశ్ మాట్లాడుతూ తమ ఇంటి ఇలవేల్పు బుగులు వేంకటేశ్వర స్వామి ని శ్రావణ మాసంలో కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 18: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తానేధార్‌పల్లిలో కల్లుగీత కార్మిక సంఘం మండలాధ్యక్షుడు మాచర్ల రఘు రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాటికొండలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఐలోని సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. డివిజన్ కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో గౌడ సంఘం అధ్వర్యంలో పాపన్న జయంతి వేడుకలను జరిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గట్టు ఉప్పలయ్య, బంగ్లా శ్రీనివాస్, పులి శ్రీనివాస్, గట్టు రమేష్, గట్టు చేరాలు, ఇల్లెందుల శ్రీనివాస్, రాజు, గట్టు క్రిష్ణ, గట్టు రంజిత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- లింగాలఘనపురం: మండల వ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వనపర్తి, నవాబుపేట, వడ్డిచర్ల, నేలపోగుల గ్రామాల్లో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దూసరి గణపతి, వంగ వెంకటేశ్వర్లు, కూటికంటి రమేష్, బూడిద నర్సయ్య, బూడిద రాజేశ్వర్, రాజు, కోతి రాములు, తాళ్లపల్లి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.
- రఘునాథపల్లి: మొఘల్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన బహుజన పోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న బహుజనుల పాలిట బాహుబలి అని మాజీ ఎంపీపీ వై.కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో సర్వాయి పాపన్న చిత్రపటానికి మాజీ ఎంపీపీ వై.కుమార్‌గౌడ్ తదితరులు, ఖిలాషాపూర్ పోరు గడ్డలో ఆయన విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కోళ్ల రవిగౌడ్, మల్కాపురం లక్ష్మయ్య, కోళ్ల రాజుగౌడ్, గైని శ్రీనివాస్, యాకస్వామి, బండి కుమార్, ఉప్పలయ్య, రంగు రాజు, శ్రీకాంత్, సురేష్, సతీష్, ముప్పిడి సాంబ, చెరుకు నర్సింహులు, మధు, సాయి, హరీష్, బాల్నె రాజయ్య ఖిలాషాపూర్ తాజా మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, రంగు మురళి, బీమగోని చంద్రయ్య, మీసాల శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
- బచ్చన్నపేట: మండలంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. పాపన్న నిర్మించిన కోటలను,గడీలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమాల్లో నల్లగోని బాలకిషన్, వేముల వెంకట్, బొమ్మెన అంజనేయులు, ముసిని రాజు, బండకింది శింగరయ్య, ముసిని వెంకటేశ్, రాజయ్య, సందీప్, కనకయ్య, శ్రీధర్, కక్కెర్ల రాజు, అందె పర్శరాములు, దివాకర్, మోహన్, భిక్షపతి, బైరు వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.
- నర్మెట: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నర్మెట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపగోని యాద గిరి, శ్రీధర్, రాకేష్, సుదర్శన్, స్వామి, నరేష్, సతీష్, చంద్రకాంత్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.
- తరిగొప్పుల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. కల్లు గీత కార్మిక సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపల్లి పోషయ్య సారథ్యంలో తరిగొప్పులలో ఏర్పాటుచేసిన పాపన్న విగ్రహాన్ని గీతకార్మికులు ఆవిష్కరించి నివాళులర్పించారు. పాపన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో ముద్రింపజేసి భావి తరాలకు తెలియజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జొన్నగోని శ్రీనివాస్, జాగీరు చంద్రమౌళి, తాళ్లపల్లి అశోక్, వినేష్, మాజీ సర్పంచ్ దామెర ప్రభుదాస్, చింతల జేపాల్, నేతుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.
- చిలుపూర్: మండలంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను నిర్వహించారు. పల్లగుట్టలో బీజేపీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు ఊరడి రాజు నేతృత్వంలో జరిగిన వేడుకలకు మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్ హాజరై పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చిన్నపెండ్యాల, చిలుపూర్, లింగంపల్లి తదితర గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకలకు తాళ్ళపల్లి బాబుగౌడ్, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, బీజేపీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్, గుగులోతు మధునాయక్, గనగోని రమేష్, నారగోని రాజుగౌడ్, పంతం రాజు, కంకటి రాజన్న హాజరయ్యారు.
- దేవరుప్పుల: బహుజనుల విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన సర్దాయి సర్వాయి పాపన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సీతారాంపురంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని దాతలు సుందర్‌రాంరెడ్డి, యేల సుందర్, బస్వ మల్లేశంతో కలిసి ఆవిష్కరించి పూలమాలలు వేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు బస్వ సోమయ్య, రామచంద్రు, నర్సయ్య, వెంకన్న, జహింగీర్, వడ్లకొండ వినయ్ తదితరులు పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ, సజ్జన్‌నాయక్, నాగరాజు, యాకస్వామి, రతన్, రెడ్డిరాజుల రమేష్ పాల్గొన్నారు.
- పాలకుర్తి: మండల కేంద్రంలోని పాపన్న చౌరస్తాలో సర్దార్ పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బహుజన రాజ్యం కోసం జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు మాటూరి యాకయ్య, కారుపోతుల వేణు, గిరగాని కుమారస్వామి, బ్లాక్ అధ్యక్షుడు రాపక సత్యనారాయణ, మూల వెంకటేశ్వర్లు, గూడ దామోదర్, కారుపోతుల శ్రీనివాస్, పోశాల వెంకన్న, పొడిశెట్టి వెంకన్న, కమ్మగాని పరమేశ్వర్, గిలకత్తుల సుధాకర్ పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి మండల బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్, నాగేష్, ముఖద్దం ఉన్నారు.
- కొడకండ్ల: బహుజన మహానాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న అని గౌడ సంఘం నాయకులు అన్నారు. మండలకేంద్రంలో స్థానిక గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆగస్టు 15న ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న ఏఎస్ఐ రమేశ్‌గౌడ్‌ను సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, కె.అమరేందర్‌రెడ్డి, మసురం వెంకట నారాయణ, మసురం రవీందర్, దూలం సతీష్, కోటగిరి కుమార్, వీరగోని రాందాస్, నర్మెట శ్రీనివాస్, నర్మెట శేఖర్, సతీష్, మామిడి మల్లయ్య దేశగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- జఫర్‌గడ్: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. కూనూరు, జఫర్‌గడ్‌లో స్థానిక సర్వాయి పాపన్న విగ్రహానికి, జఫర్‌గడ్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి గౌడ, గీత కార్మిక సంఘాల నేతలు, గీత కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో జయంతి సందర్భంగా జెండాలను ఆవిష్కరించి చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు. చారిత్రక జఫర్‌గడ్ కోటను పునర్నిర్మాణం చేసి పాపన్న కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మిక సంఘం అధ్యక్షుడు చిర్ర చందర్, గోపా యువజన రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్, ఎండి.వలీపాషా, పులి శ్రవణ్‌కుమార్, అరవింద్, తాళ్లపల్లి సురేశ్, కత్తి సందీప్, యాదగిరి, గణేష్, లింగమూర్తి పాల్గొన్నారు.



ఖిలాషాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



తానేధార్‌పల్లిలో పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకుర్తిలో పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న గీత కార్మికులు



జఫర్‌గడ్ కోటలో పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిలుపూర్, ఆగస్టు 18: మండలంలోని చిన్నపెండ్యాల శివారు ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. చిన్నపెండ్యాలకు చెందిన చెరిపెల్లి సురేశ్ తన ట్రాక్టర్ ద్వారా ఆకేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు నివేదించామని ఎస్సై పేర్కొన్నారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

జఫర్‌గడ్, ఆగస్టు 18: మండలంలోని తమ్మడపల్లి(జి)లో దుర్గమ్మ ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం... గ్రామ చివర గల దుర్గామాత గుడికి వేసి ఉన్న తాళాన్ని అర్ధరాత్రి సమయంలో కొందరు దుండగులు పగులగొట్టారు. లోపల ఉన్న హుండీని సైతం పగులగొట్టి కానుకలు, నగదును దోచుకెళ్లారన్నారు. భక్తులు ఉదయం ఆలయం వద్దకు రాగా, ఆలయం తలుపులు తెరుచుకుని ఉండి హుండీ బయట కనిపించింది. గుడిలో చోరీ విషయమై ఆదివారం స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేరిణి నృత్య శిక్షణ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 18: డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్‌లో శ్రీచంద్ర కళానిలయం జనగామ వారి ఆధ్వర్యంలో పేరిణి నృత్య శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక లయన్స్ భవన్‌లో చిన్నారులకు 2 రోజుల పాటు నిర్వహించే శిబిరాన్ని ఆదివారం క్లబ్ అధ్యక్షుడు ఎ.కిషన్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా 40 మంది చిన్నారులకు వారానికి 2 రోజులు శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చిన గురువు పేరిణి సంతోష్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు విజయ్‌చందర్, వెంకటేశ్వర్లు, రాంకిషన్, పి.వేణు, వి.తిరుమల శ్రీనివాస్, ఎ.మధు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చిలుపూర్, ఆగస్టు 18: మండలంలోని చిన్నపెండ్యాలలో హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ తెలిపిన ప్రకారం... స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన సుక్క యేసు తన ద్విచక్ర వాహనంపై హనుమకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే మార్గంలో హనుమకొండ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గీసుకొండ మండలం వంచనగిరికి చెందిన మార్త్తాల ప్రశాంత్ అనే యువకుడు ముందుగా వెళ్తున్న యేసు బైక్‌ను ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుక్క యేసుకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు మృతి

నర్మెట, ఆగస్టు 18: మండలంలోని వెల్దండలో విద్యుదాఘాతంతో నాలుగు పాడిగేదెలు, పెంపుడుకుక్క మృతి చెందాయి. గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. గ్రామంలో శనివారం రాత్రి కురిసిన గాలితో కూడిన వర్షానికి వెల్దండ, కేశిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో తీగల బావి(వెల్దండ రిజర్వాయర్) వద్ద చెట్టు కూలి విద్యుత్ తీగల మీద పడడంతో తెగిపడ్డాయి. ఆదివారం గ్రామానికి చెందిన వంగ భూపాల్‌రెడ్డి తన గేదెలను మేపి నీళ్లు తాగించడానికి రిజర్వాయర్ వద్దకు తోలుకుపోతుండడంతో తీగల బావి వద్ద తెగి పడిన విద్యుత్ వైర్లకు తాకడంతో షాక్‌కు గురై మూడు పాడి గేదెలు, ఒక దూడ, పెంపుడు కుక్క అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుడు భూపాల్‌రెడ్డి మృతి చెందిన గేదెలను చూసి బోరున విలపించాడు. సుమారు రూ.3.50 లక్షల నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ స్తంభాలను అక్కడి నుంచి మార్చాలని గతంలోనే విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే మూగ జీవాలు మృతి చెందాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బాధితుడికి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

వామ్మో.. పదహారో వార్డు

రోడ్లపైకి డ్రెయినేజీ నీరు
దుర్గంధంతో జ్వరాల బారిన ప్రజలు
సమస్యను పట్టించుకోని అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 18: 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా ఉంది స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని 16వ వార్డు పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా వార్డులో డ్రెయినేజీ సమస్య అలాగే ఉంది. ఇతర వీధుల నుంచి వచ్చే డ్రెయినేజీ నీరు 16వ వార్డులోని పలు వీధుల్లోకి చేరడంతో గృహ సముదాయాలు మురికి కూపంగా మారాయి. దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలకు ఆవాసంగా మారడంతో అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామపంచాయతీకి సర్పంచ్‌లు, ఈవోలు మారినప్పటికి 16వ వార్డు దుస్థితి మాత్రం మారడం లేదని ప్రజలు వాపోతున్నారు. జీపీకి పన్నులు చెల్లిస్తున్నప్పటికి వార్డును పట్టించుకోవడం లేదని డివిజన్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ సముదాయాల మధ్య చుట్టూరా డ్రెయినేజీ నీరువచ్చి చేరడంతో కంపు భరించలేక పోతున్నామని, ఇప్పటికే అనేక కుటుంబాలు గృహాలు విడిచి మరో చోటుకు వెళ్లి ఉంటున్నారని చెబుతున్నారు. ఖాళీ ప్లాట్లు పూర్తిగా నిండి వీధుల్లోని సీసీ రోడ్లపైకి వ్యర్థాలతో కూడిన డ్రెయినేజీ నీరు చేరుతుందని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు చేసేదేమి లేక మురుగు నీటిలో నుంచే నడిచి వెళ్తున్నారు. దివ్యాంగులు మురుగు నీటిలో చేతులు పెట్టి గెంటుకుంటూ వెళ్తున్న తీరును అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇంత అధ్వానంగా వీధులు ఉన్నప్పటికి స్వచ్ఛ గ్రామంలో ఘన్‌పూర్‌ను ఎంపిక చేయడం హాస్యాస్పదమని, అవార్డు తీసుకునే అర్హత అధికారులకు లేదని ప్రజలు అంటున్నారు. 16వ వార్డు దుస్థితిని మార్చిన తరువాతే అవార్డు తీసుకొని చిత్తశుద్ధి చాటుకోవాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ వార్డును సందర్శించి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



మురుగునీటిలో నుంచి వస్తున్న దివ్యాంగ వృద్ధుడు



గృహ సముదాయాల మధ్య నిలిచి ఉన్న మురుగు నీరు

వైద్యురాలి మృతికి కారకులను శిక్షించాలి

జనగామ రూరల్, ఆగస్టు 18: కోల్‌కతాలో వైద్యురాలి మృతికి కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ జిల్లా అధ్యక్షుడు జోగు భాస్కర్ అన్నారు. హత్యాచారానికి గురైన వైద్యురాలి చిత్రపటానికి ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులపై లైంగిక హత్యలు జరగడం సభ్య సమాజం తలదించుకునే చర్య అన్నారు. దుండగులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి గౌరవప్రదమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎడునూరి రాజ్, జోగు ఉదయ్, సాయిరాం, శేఖర్, కర్రె వెంకటేష్, సంతోష్, మను తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు

▸▸ పట్టణంలోని ఓ బంకులో ఘటన



నీరు కలిసిన పెట్రోల్‌ను చూపుతున్న బాధితుడు

జనగామ రూరల్, ఆగస్టు 18: రెండు రోజుల క్రితం నిడిగొండ పెట్రోల్ బంకులో పెట్రోల్‌లో నీళ్లు వచ్చిన ఘటన మరువక ముందే మరో సంఘటన చోటుచేసుకుంది. జనగామ పట్టణానికి చెందిన చింతకింది కుమార్ అనే వ్యక్తి ఆదివారం సూర్యాపేట రోడ్డులోని పెట్రోల్ బంకులో తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోసుకొని కొంత దూరం పోగానే ఆగిపోయింది. ఎంతకీ స్టార్ట్ అవ్వకపోవడంతో స్థానిక మెకానిక్ వద్దకు తీసుకెళ్లగా అనుమానంతో బండిలో కొట్టించిన పెట్రోల్‌ను బాటిల్‌తో బయటకు తీయగా సగం నీళ్లు వచ్చాయి. ఈ విషయమై బంకు సిబ్బందిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బాధితుడు తెలిపాడు. కాగా, బంకుల్లో పెట్రోల్‌కు బదులుగా నీళ్లు వస్తుండడంతో వాహనదారులు పెట్రోల్ పోసుకోవాలంటేనే భయపడుతున్నారు.

ఘనంగా ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు

పాలకుర్తి, ఆగస్టు 18: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు హనుమాండ్ల తిరుపతిరెడ్డి హాజరై మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం పేదల పక్షాన ఉండి అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రాపాక సత్యనారాయణ, ఎర్రబెల్లి రాఘవరావు, నలమాస రమేష్, సాయికృష్ణ, గడ్డం యాకసోమయ్య, భూమ రంగయ్య, జల్గం కుమారస్వామి, బైకాని ఐలేష్, ఎండి.సలీం పాల్గొన్నారు.

- కొడకండ్ల: కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో, గిర్నితండా చౌరస్తాలో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకల సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో రైతు రుణమాఫీ అమలైన సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ పొందిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో హనుమాండ్ల తిరుపతిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అందె శ్రీవర్ధ, రాజేష్‌నాయక్, ధర్మారం భిక్షపతి, మసురం రవీందర్, వనం యోహన్, బత్తుల వెంకన్న, మహేశ్ యాదవ్, ఐత రాజు, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



పాలకుర్తిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పద్మశాలీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

▸▸ చేనేత హక్కుల ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జ్ దామోదర్



చిన్నపెండ్యాల పోలింగ్ కేంద్రం ఎదుట మాట్లాడుతున్న చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజ్జెల దామోదర్

చిలుపూర్, ఆగస్టు 18: రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న పద్మశాలీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జ్, పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు గజ్జెల దామోదర్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నపెండ్యాలలో పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులుగా పోటీ చేస్తున్న వల్లకాటి, రాజ్‌కుమార్, బూర మల్లేశంలు గెలుపు ఎవరిదైనా పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న 340 మంది సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారిగా మంతెన వీరనర్సయ్య, అబ్జర్వర్‌గా మచ్చ బాలనర్సయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో బత్తుల సూర్యనారాయణ, పేరాల రాజమౌళి, బండారి రాజ్‌కుమార్, డాక్టర్ వేముల వెంకటేశ్వర్లు, తౌటి శ్రీధర్, డాక్టర్ పేరాల సుధాకర్, సాంబారి రాజ్‌కుమార్, పేరాల నాగభూషన్, మేరుగు సంతోష్, సుదర్శన్, ఆమంచ జానేశ్వర్, దేవదాసు, కొమురయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

- స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో పద్మశాలీ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక కోసం ఆదివారం పద్మశాలీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం పోలింగ్ నిర్వహించగా పద్మశాలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొత్తం 309 ఓటర్లు ఉండగా 201 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.సత్యనారాయణ, కృష్ణమూర్తి, సురేందర్, పి.గణేష్, జి.రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- రఘునాథపల్లి: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి కోసం మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు పద్మశాలీ సంఘం జిల్లాప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 220 మంది ఓటర్లకు గాను 208 మంది సభ్యులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కర్నికొండ వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల అధికారి మంతెన వీరనర్సయ్య, సోంనర్సయ్య, సిద్ధయ్య, భాస్కర్, కృష్ణ, చింతకింది భిక్షపతి, ప్రవీణ్, నర్సయ్య, ప్రదీప్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- జఫర్‌గడ్ : తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక పోలింగ్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఓటు హక్కు కలిగిన మండలంలోని వివిధ గ్రామాల పద్మశాలీ కులస్థులు కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ బానోత్ రాం చరణ్‌నాయక్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు సందర్శించి పరిశీలించారు. 422 ఓట్లకు 328 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.